

వైఎస్ఆర్

సింహ వాహనంపై వేంకటేశ్వరుడు

ప్రజాశక్తి - కడప అర్బన్



తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారు శ్రీదేవి భూదేవి సమేతంగా మంగళవారం పురవీధుల్లో ప్రజలకు దర్శనమిచ్చారు. ఉదయం చిన్న శేష వాహనం, రాత్రి సింహ వాహనంపై ఆశీనులయ్యారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన కళాకారులు స్వామివారి వాహనాల ముందు కోలాటాలు, చెక్కభజనలు, వివిధ వేషాలలో అలరించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, టీటీడీ అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

- కలెక్టర్ విజయరామరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించి ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో జిల్లా వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వి.విజయ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సభాభవన్‌లో మనబడి 'నాడు నేడు' ఫేస్-2 పనుల పురోగతిపై విద్యాశాఖ, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ జెసి సాయికాంత్ వర్మ, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనాలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించి విద్యార్థుల్లో చదువుపై మక్కువ పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. మొదటి దశ 'నాడు-నేడు' అభివృద్ధి పనుల ప్రభావంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, రెండవ దశ నాడు-నేడు పనుల నిర్వహణలో వైఎస్ఆర్ జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల విద్యతో పాటు కౌమార బాలికల పర్సనల్ కేర్ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి ఆరోగ్య స్థితి, ఎత్తు, బరువు ప్రమాణాలను ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేయాలని ఆదేశించారు. రోజూ ప్రార్థన సమయంలో విద్యార్థులకు సూక్తులు, వార్త పత్రికల్లో నాలెడ్జ్ అంశాలను చదివి వినిపించాలన్నారు. పిల్లలచే పాఠాలు, పద్యాలు, సెమినార్స్, గ్రూప్ డిస్కషన్ నిర్వహింపచేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా వారిలో భయం, బిడియం దూరం అవ్వడంతో పాటు మానసిక వికాసం, సామాజిక స్పృహ పెంపొందుతాయన్నారు. ఈ విషయంలో అవసరమైతే ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇప్పించాలని తెలిపారు. రెండవ దశ నాడు - నేడు పనులు నాణ్యతలో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నిర్వహణలో ఏమాత్రం అలసత్వం లోపాలుంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. మండల స్థాయిలో మండల విద్యాశాఖ అధికారి, ఇంజినీరింగ్ అధికారి ఎప్పటికప్పుడు ప్రతి పనిని తనిఖీ చేస్తూ నివేదికలందించాలని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఫోటోలను ఆన్‌లైన్‌లో ఎస్‌టిఎంఎస్‌లో నమోదుచేసి పంపాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి దేవరాజు, సమగ్ర శిక్ష పీడీ అంబవరం ప్రభాకర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాసుల రెడ్డి, ఎపిఈడబ్ల్యుఐడిసి ఇఇ కరుణాకర్ రెడ్డి, సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, మండల ఇంజనీర్లు, మండల విద్యాశాఖ అధికారులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్స్, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు, సమగ్ర శిక్ష కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి - పోరుమామిళ్ల టౌన్



ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీలను పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, వారికి ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.భైరవ ప్రసాద్ మద్దతు తెలియజేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలపై ఉక్కుపాదం మోపుతున్నారని వాపోయారు. వారిపై పనిభారం వేయడమే కాక అధికారులతో వేధింపులు గురిచేయడం బాధాకరమని వాపోయారు. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అమ్మగా, చెల్లిగా, టీచర్‌గా సేవలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డం విడ్డూరమని వాపోయారు. వెంటనే అంగన్వాడీ టీచర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని మెనూ ఛార్జీలు సక్రమంగా ఇవ్వాలని, ప్రతినెలా ఒకటో తేదీ జీతాలు కల్పించాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఓబులాపురం. విజయమ్మ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు వినోద దేవి, మేరీ, పోరుమామిళ్ల సెక్టార్ లీడర్ జ్యోతిమ్మ, శ్రీదేవి దస్తగిరిమ్మ, రమాదేవి, కోశాధికారి రేణుకాదేవి అంగన్వాడీ, టీచర్లు, ఆయాలు, మినీ అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు



పుత్తానరసింహారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మన్సూరు అక్బర్

హజ్ హౌస్‌ను విస్మరించడం బాధాకరం

ప్రజాశక్తి - కడప అర్బన్

ముస్లిములు పవిత్ర మక్కా, మసీదుకు వెళ్లేందుకు రూ.28 కోట్లతో నిర్మించిన హజ్ హౌస్‌ను వైసిపి ప్రభుత్వం విస్మరించడం బాధాకరమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం హోటల్ హరిప్రియలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్, మైనారిటీ నాయకులు నరసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మన్సూర్ అక్బర్ మాట్లాడుతూ హజ్ హౌస్‌లో కార్యకలాపాలు జరిగే దిశగా ఉద్యమాలు చేపడుతున్నామని చెప్పారు. చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబు దృష్టికి తీసుకొని వెళ్లాలని కోరారు. జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ప్రభుత్వం నిరంకుశ వైఖరిని ప్రస్తావించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన నరసింహారెడ్డి స్పందించిన హజ్ హౌస్‌ను సాధించే దిశగా లోకేష్‌బాబు యువగళం పాదయాత్రలో గళం విప్పేవిదంగా చూస్తామని పేర్కొన్నారు. ముస్లిముల మనోభావాలను కాపాడతామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర డాక్టర్ సెల్ కార్యదర్శి కృష్ణ కిషోర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జాకిరుద్దీన్, టిడిపి నాయకులు బర్కతుల్లా, జిల్లా కార్యదర్శి జమీల్, షబ్బీర్, దర్బార్, జబ్బీల్లా, గౌస్ పీర్, సుభాని, మల్లి, కలాం, సయ్యద్ రహిమాన్, దస్తగిరి, ఆర్.హుస్సేన్, సయ్యద్ చాను, అజమాతుళ్ళ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంక్ డిజిఎం రోసిలినా

రుణ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- యూనియన్ బ్యాంక్ డిజిఎం జూన రోసిలినా

ప్రజాశక్తి - కడప అర్బన్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కల్పిస్తున్న రుణ పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని డిజిఎం జూన రోసిలినా కోరారు. మంగళవారం ప్రొద్దుటూరులో సూక్ష్మ, చిన్న పరిశ్రమల వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారిశక్తి, ఆయుష్మాన్ ప్లస్, ఆరోగ్యం, అలంకార, జిఎస్‌టి గైడ్స్, సువిధ పథకాలున్నాయని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాలైన పిఎం ముద్ర, స్టాండ్ అప్ ఇండియా, పిఎంఇజిసి పథకాలకు రుణాలు విశేషంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కడప ప్రాంతీయ అధికారి భాస్కర్, ఎంఎస్ఎంఇ అధికారా పరుశురాం నాయక్, బ్రాంచ్ మేనేజరు, వినియోగదారులు పాల్గొన్నారు.

హెల్మెట్, సీట్ బెల్టులు ధరించండి

కడప అర్బన్ : హెల్మెట్ , సీటు బెల్టు ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్‌పి అన్బురాజన్ పేర్కొన్నారు. గ్రామాల సందర్శన సమయంలో నిర్వహించే గ్రామసభల్లో ఫ్యాక్షన్, మట్కా, సైబర్ నేరాలు తదితర అంశాలుతో పాటు రోడ్డు భద్రతపై ప్రజలను చైతన్యం చేస్తున్నట్టు తెలిపారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో పక్కాగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని చెప్పారు. జిల్లాలో పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై మొత్తం కేసులు 422 కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన చోదకులపై 397 కేసులు, సీటు బెల్టు ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు, తదితర వాహన చోదకులు 25 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు కడపకు నారా లోకేష్ రాక

కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ టూర్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పు చోటుచేసుకుంది. బుధవారం మధ్యాహ్నం 1.45కి హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌కి చేరుకుని నందమూరి తారకరామునికి నివాళులు అర్పిస్తారు. సాయంత్రం కడపకు చేరుకుంటారు. ముందుగా దేవుని కడప లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం అమీన్‌పీర్ దర్గా లో ప్రార్థన నిర్వహిస్తారు. అక్కడి నుంచి రోమన్ కేథలిక్ చర్చిలో సాయంత్రం 6.30కి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొంటారు. అనంతరం రోడ్డుమార్గంలో తిరుమల చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. గురువారం ఉదయం తిరుమల శ్రీవారి దర్శనం చేసుకుంటారు. తిరుమల నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2.30కి కుప్పం చేరుకుంటారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డి

పేదలకు దంత వైద్య సేవలందించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-కడప సిటీ

పేదలకు కూడా దంత వైద్య సేవలు అందించాలని ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగర శివారులోని శిల్పారామంలో రిమ్స్ దంత వైద్యకళాశాల10వ స్నాతకోత్సవ వేడుకలు ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌డిఒ మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ తరువాత ఎవరికి వారు మార్గదర్శకులు అవుతారని చెప్పారు. దంత కళాశాలలో శిక్షణ పొందిన విద్యార్థులు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో మంచి వైద్యులుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. దంతవైద్య కళాశాలలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాయని చెప్పారు. వచ్చే నెలలో మొబైల్ డెంటల్ వ్యాన్ సాయంతో 'వైఎస్ఆర్ చిరునవ్వుతో' పథకం ప్రారంభించబోతున్నామని చెప్పారు. దీని వల్ల గ్రామాల్లోని ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు పట్టాలను, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో దంత వైద్యకళాశాల ప్రొఫెసర్స్ డాక్టర్ బాలసుబ్రమణ్యం, డాక్టర్ నరేంద్రదేవ్, డాక్టర్ జోత్స్న, డాక్టర్ కోటయ్య, డాక్టర్ వజ్రమాధురి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

వల్లూరు : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి ఎక్కడ కనబడట్లేదని టిడిపి మండల కన్వీనర్ లేబాక నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. టిడిపి పార్టీ పిలుపు మేరకు వల్లూరు మండలంలోని టిజి పల్లిలో నియోజకవర్గ పుత్తా నరసింహ రెడ్డి ఆదేశాల మేరకు ' ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షుడు ప్రజలతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చాక సామాన్యుడు బతికే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. నిత్యావసర ధరలు, పన్నుల భారం, విద్యుత్ ఛార్జీలు, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని వాపోయారు. వైసిపి అరాచక పాలనకు చరమ గీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు టి రాఘవరెడ్డి , రామచంద్రారెడ్డి ఎల్ఎంఆర్ శివకేశవరెడ్డి , దస్తగిరి వెంకటసుబ్బయ్య, పుల్లయ్య, రామసుబ్బయ్య, చంద్ర, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, చిట్టిబాబు, అబ్దుల్ రసూల్, రమణారెడ్డి, ఓబులేసు, నరసింహులు, కృష్ణయ్య, పాపిరెడ్డి పుల్లారెడ్డి, నారాయణరెడ్డి టిడిపి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి అధికారంలోకి రావడం కల : వైసిపి

ప్రజాశక్తి- కడప

ప్రతిపక్ష నేత చంద్రబాబు తనయుడు లోకేష్ పాదయాత్ర కాదు కదా పొర్లు దండాలు పెట్టినా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాదని వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాదయాత్ర అనేది ఒక వైఎస్ కుటుంబానికే పేటెంట్ హక్కు అన్నారు. 14 ఏళ్ల అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ జిల్లాకు ఏం చేసిందో చెప్పాలన్నారు. జిల్లాలో ఒక్కటైనా ప్రతిష్టాత్మక ప్రాజెక్టును పూర్తి చేశారా అని ప్రశ్నించారు. జిల్లా ప్రజలు ఎప్పటికీ టిడిపిని నమ్మబోరని తెలిపారు.

30న జడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- కడప అర్బన్

ఫిబ్రవరి 3న నిర్వహించ తలపెట్టిన జడ్‌పి సర్వసభ్య సమావేశాన్ని అనివార్య కారణాల వల్ల ఈ నెల 30న ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య ఉంటుందని తెలిపారు. ఈ నెల 31 నుంచి రాష్ట్ర అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మార్పు అనివార్యమైందని పేర్కొన్నారు. మార్పును జడ్‌పి సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు గమనించి, జిల్లాలో అభివృద్ధి ప్రగతి నివేధికలతో పాటు, అభివృద్ధి చేయాల్సిన అంశాల ప్రతిపాదనలకు సంబంధించి సమగ్ర సమాచారంతో హాజరు కావాలని తెలిపారు.

టిడిపి నాయకుల పాదయాత్ర

ప్రజాశక్తి- కడప అర్బన్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టబోయే యువగళం పాదయాత్రకు మద్దతుగా తెలుగుదేశం పార్టీ నాయకులు పాదయాత్ర చేపట్టారు. మంగళవారం నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి 7 రోడ్స్ సర్కిల్, కృష్ణ సర్కిల్, దేవుని కడప వరకు పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్ర విజవంతం కావాలని దేవుని కడపలో 108 టెంకాయలు కొట్టి వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డి, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శులు హరి ప్రసాద్, గోవర్ధన్ రెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్ బాబు, జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, జయ కుమార్, మాసాపేట శివ, బండి జయ శేఖర్, టీడీపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఫిష్ ఆంధ్రా' మార్కెటింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి - కడప

ఫిష్ ఆంధ్రలో భాగంగా డొమెస్టిక్ మార్కెటింగ్ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని కలెక్టర్ విజయ్‌రామరాజు పేర్కొన్నారు. మంగళవారం కల్లెక్టరు అధ్యక్షతన తన ఛాంబర్‌లో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పిఎంఎంఎస్ వై) పథకంలోని ఫిష్ ఆంధ్ర డొమెస్టిక్ మార్కెటింగ్" పథకాల అమలుపై సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేపల డొమెస్టిక్ మార్కెటింగ్ పథకాలను త్వరిత గతిన అమలు చేయాలని చెప్పారు. ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాల కంటే అధికంగా లబ్దిదారుల ఎంపిక చేయాలని చెప్పారు. వాటిని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) ముగిసేలోపు త్వరిత గతిని అమలు చేయాలని మత్స్యశాఖతో పాటు డిఆర్‌డిఎ, మెప్మా అధికారులను ఆదేశించారు. లబ్దిదారులకు లబ్దిదారుల వాటా చెల్లింపులో బ్యాంకులు చొరవ తీసుకోవాలని అన్నారు. పోషకాహార విలువలున్న చేపలను అందరు వినియోగించేలా పై పథకాల ద్వారా అందుబాటులోకి తీసుకురావాలని కల్లెక్టరు వారు అధికారులను ఆదేశించారు. సమావేశంలో శిక్షణ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి సుధాకర్‌రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డిఆర్‌డిఎ ఆనంద్ నాయక్, అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్, మెప్మా, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్, జిల్లా మత్స్యశాఖ అధికారి కె.యస్.వి. నాగలింగాచార్య పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్ అడ్రస్ 'రాచమల్లు'

- టిడిపి ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రొద్దుటూరు వైసిపి ఎంఎల్ఎ రాచమల్లు రాంప్రసాద్‌రెడ్డి అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్నారని టిడిపి ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం గాయత్రీ టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచమల్లు కనుసన్నలలో మట్కా, ఎర్రచందనం స్మగ్లింగ్, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్ కొనసాగుతూ ఉన్నాయని పేర్కొన్నారు. రాచమల్లు అనుంగ శిష్యురాలు రసపుత్ర రజని రూ. 4. 17 లక్షల 500 దొంగ నోట్లతో కర్ణాటక పోలీసులకు ఈనెల 19న పట్టుబడిందని తెలిపారు. గతంలో ప్రొద్దుటూరులో ఐపి పెట్టిన ఘనత ఆమెదే అని ఆరోపించారు. ఇలాంటి రజనీకి ఎమ్మెల్యే ఏపీ బొందలి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమింప చేశారని విమర్శించారు. రాచమల్లు ద్వారా ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగుల నుంచి రూ. 15 లక్షలు 20 లక్షలు వసూలు చేశారేని చెప్పారు. దొంగ నోట్లు కడపలో రాచమల్లు పర్యవేక్షణలో ముద్రిస్తున్నట్లు అనుమానంగా ఉందని చెప్పారు. తనపై తప్పుడు కేసు పెట్టించిన రాచమల్లు మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాచమల్లు, ఆయన బంధువుల ద్వారా ఆర్థిక కార్యకలాపాలలో భాగస్వాములైన వారు ఒకసారి డబ్బు నోట్లను పరిశీలించుకోవాలని సూచించారు. సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

భూమయ్యకు భూతపురి స్మారక పురస్కారం

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రసిద్ధ కవి, విమర్శకులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య అనుమాండ్ల భూమయ్య 'మహాకవి' 'శతావధాని' డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ 21వ స్మారక సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారని డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ భూతపురి శివరామ సురేంద్ర శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియల్ ట్రస్ట్, అల్లసాని పెద్దన సాహితీ పీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19, ఉదయం 10 గంటలకు కడపలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించే భూతపురి 86వ జయంతి మహోత్సవంలో ఈ పురస్కారం అందజేస్తామని తెలిపారు.

సమాజ సేవలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

యువత సమాజ సేవలో కీలక పాత్ర పోషించాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణురాలు స్వర్ణలత తెలిపారు. మంగళవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ నరేష్ అధ్యక్షతన ఘనంగా జాతీయ యువజనోత్సవం నిర్వహించారు. మొదటగా స్వామి వివేకానందుని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ యువజనోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ మార్కా రెడ్డి , సమాజ సేవకులు రాజోలి శ్రీధర్ రెడ్డి, మదర్ థెరిసా ఫౌండేషన్ చైర్మన్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకుని లక్ష్యం వైపు పయనించాలన్నారు. విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. సామాజిక మాధ్యమాలతో మంచిని పెంపొందించే ప్రయత్నం చేయాలన్నారు. పుస్తక పఠన ప్రాముఖ్యతను వివరిస్తూ మహనీయుల జీవితాలను చదవాలని సూచించారు. సమాజ సేవకు అంకితం అయిన పాపిజెన్ని రామకృష్ణారెడ్డిని అభినందించారు. అనంతరం కళాశాలకు ఒక కంప్యూటర్‌ను అందించారు. స్టెప్ సహకారంతో కెరీర్ గైడెన్స్ పుస్తకాలను, ఉత్తమ ప్రతిభ కనబర్చిన యువతకు ప్రశంస పత్రాలు, బహుమతులు , వివేకానందుని సాహిత్యం అందజేశారు. కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ సుబ్బారాయుడు, జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ ప్రకాష్ రావు, అధ్యాపకులు సులోచన , సంస్థ ప్రతినిధులు వాసు, శివ, కిరణ్ పాల్గొన్నారు.

31న ధర్నా జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్ పునరుద్ధరణ, ప్రావిడెంట్ ఫండ్ నిధుల చెల్లింపు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 31న ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జి. శివ శంకర్ రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనువాసులురెడ్డి తెలిపారు. మంగళవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది జనవరి నుంచి రిటైర్డ్ అవుతున్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగులకు, కొత్త ఫ్యామిలీ పెన్షనర్స్‌కు రావాల్సిన ప్రావిడెంట్ ఫండ్ నిధులు, పెన్షన్ చెల్లింపులను ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ కడప ప్రాంతీయ కార్యాలయం పూర్తిగా నిలిపి వేశారని చెప్పారు. ఈ నేపథ్యంలో తమ బ్యాంకు యాజమాన్యం ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం వారిని తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుకు రావాల్సిన నిధులు తక్షణమే బ్యాంకు పెన్షన్ ఫండ్ ట్రస్ట్‌కు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు కడప, కర్నూలు, ఒంగోలు, అనంతపురం, నెల్లూరు, తిరుపతి, బాపట్ల, నంద్యాల, కదిరి, అన్నమయ్య జిల్లాలకు చెందిన ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉప ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి పాల్గొన్నారు.

వేధింపులు సబబు కాదు : ఫ్యాప్టో

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యాశాఖాధికారులు పాఠశాలలను సందర్శించే పేరుతో చిన్న చిన్న కారణాలను సాకుగా చూపి ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం, షోకాజు నోటీసులు జారీ చేసి వేధించడం సబబు కాదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) కడప జిల్లా చైర్మన్ మాదన విజయ కుమార్, సెక్రటరీ జనరల్ షేక్ మొహమ్మద్ ఇర్షాద్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు విద్యాశాఖాధికారులు పాఠశాలలను సందర్శించడం, తనిఖీలు చేయడం మంచి పరిణామమేనని, ఆ పేరుతో చిన్న చిన్న కారణాలను సాకుగా చూపి ఉపాధ్యాయులను వేధించడం తగదని తెలిపారు. విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడిలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు విద్యావ్యవస్థను బలోపేతం చేసేలా వ్యవహరించాలే తప్ప, షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్లు చేయడం సరికాదని తెలిపారు. అధికారుల పరిశీలనలో ఎక్కడైనా లోపాలు కనిపిస్తే వాటిని ప్రధానోపాధ్యాయులతో, ఉపాధ్యాయులతో చర్చించి, లోపాలను సరి చేసుకునేందుకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. అలాకాకుండా చిన్న సంఘటనలకే ఉపాధ్యాయులకు షోకాజు నోటీసులు జారీ చేయడం, సస్పెన్షన్లను చేయడం ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమేనని తెలిపారు. కక్షపూరిత చర్యలను కొనసాగిస్తే ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని తెలిపారు.

యువతకు భరోసా ఇచ్చేందుకే లోకేష్ పాదయాత్ర

- టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువతకు భరోసా ఇచ్చేందుకే రాష్ట్రంలో పాదయాత్ర నిర్వహించనున్నారని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ద్వారకా నగర్‌లోని గాయత్రి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం నుంచి కంపెనీలు తరలి వెళ్ళిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువత ఉద్యోగాలు లేక, ఉపాధి లభించక వైసీపీ ప్రభుత్వంపై విరక్తి చెందారని తెలిపారు. బీటెక్ చదివిన వారిని బ్రాందీ షాపులో ఉద్యోగం కల్పించిన ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కుతుందని ఎద్దేవా చేశారు. టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ మాట్లాడుతూ మొదటిసారి దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి నారా లోకేష్ రానున్నారని పేర్కొన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, జియావుద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

అగ్ని ప్రమాదాలు జరిగినపుడు ఎటువంటి భయాందోళనలు చెందకుండా చాకచక్యంతో మెలిగి విపత్తుల నుంచి బయట పడాలని అలాగే విద్యార్థి దశ నుంచే ధైర్య సాహసాలు అలవర్చుకోవాలి ఫైర్ ఆఫీసర్ వసంతనాయక్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పట్టణంలోని శ్రీ వైష్ణవి సిబిఎస్‌సి పాఠశాలలో అగ్ని ప్రమాదాలపైన అవగాహన కార్యక్రమాన్ని పాఠశాల కరెస్పాండెంట్ ఆర్.వి.రామకృష్ణ, డైరెక్టర్ ఆర్.కల్యాణి ,ప్రిన్సిపల్ ఆర్.మల్లికార్జున అధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాలు ఎన్ని రకాలుగా సంభవిస్తాయి, వాటిని ఎలా అరికట్టవచ్చునో మాక్‌డ్రిల్ ద్వారా కళ్ళకు కట్టినట్టుగా విద్యార్థులకు చూపించి చక్కని అవగాహన కల్పించారు. మారుతున్న ఆధునిక ప్రపంచంలో ఎక్కువ శాతం ప్రమాదాలు మానవ తప్పిదాలవల్లే జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మెలిగినప్పుడే వాటిని నివారించవచ్చు అన్నారు. విద్యార్థులంతా పాఠశాలలో చూసినవి తల్లిదండ్రులతో చర్చించి అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలో వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి కేశవరాయుడు, ఆడమ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ వసంతనాయక్

త్వరలో చీనీ కొనుగోలు ప్రక్రియ

- మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మార్కెట్ యార్డులో చీనీ కొనుగోలు ప్రక్రియ త్వరలో ప్రారంభమవుతుందని మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్ప తెలిపారు. మార్కెట్ యార్డ్‌లో డైరెక్టర్లతో మంగళవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్నప్ప మాట్లాడుతూ రైతులకు అనుగుణంగా అన్ని వసతులు, జంబో షెడ్లు కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. షెడ్ల కింద వ్యాపారస్తులు చీనీని కొనుగోలు చేసుకోవచ్చన్నారు. కూరగాయల వ్యాపారానికి రూములు కట్టిస్తున్నామని తెలిపారు. జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి పలు అంశాలను చర్చించారు. అనంతరం 20 ఏళ్లుగా మార్కెట్ యార్డ్‌లో పనిచేస్తున్న జాన్ అనే వ్యక్తి ఉద్యోగ విరమణ కాబోతున్నందున ఆయనను చైర్మన్, డైరెక్టర్లు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కంచర్ల సర్వోత్తమ్‌రెడ్డి, డైరెక్టర్లు, మార్కెట్ యార్డ్ సిబ్బంది ఉన్నారు.


జాన్‌ను సన్మానిస్తున్న చైర్మన్, డైరెక్టర్లు

అభివృద్ధి అంటే రంగులు మార్చడమా..?

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, గతంలో తాము చేసిన అభివృద్ధికి రూపాలు, రంగులు మార్చి, మరమ్మతులు చేసుకుంటూ అభివృద్ధి చేశామని చెప్పుకోవడం సరిలేదని టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి ముక్తియార్ పేర్కొన్నారు. తన స్వగృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు తనకు ఎనిమిదివేల మంది సైనికులు ఉన్నారని గొప్పలు చెబుతున్నారని అన్నారు. వారి అక్రమ వ్యాపారాల గుట్టు అందరికీ తెలిసిందేనని ఆరోపించారు. సింగిల్ టెండర్‌తో ఎక్సెస్‌తో పనులు చేయడం దోపిడీ అనిపించుకుంటుందన్నారు. జగన్ ప్రభుత్వం కూల్చివేతలతో ప్రారంభమైందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. దర్గా అభివృద్ధికి రూ.కోటి ఇస్తానని చెప్పి ఇచ్చింది కేవలం రూ.30లక్షలు అన్నారు. ఈద్గా నిర్మిస్తానని చెప్పి ఇంత వరకూ పట్టించుకోలేదన్నారు. జామియా మసీదు, మోడంపల్లి మసీదు, ఈద్గా మసీదు, భగత్‌సింగ్ కాలనీ మసీదు, ఖాదర్‌హుసేన్ మసీదులలో కమిటీల పేరుతో వర్గవైషమ్యాలను పెంచి పోషిస్తున్నావని ఆరోపించారు. ముస్లిం సామాజిక వర్గంపై మీ పెత్తనం ఏంటని సూటిగా ప్రశ్నించారు. రాజకీయాలకతీతంగా అభివృద్ధిని ఆశించే ముస్లిం జాతి ఏకమవుతుందన్నారు. సమావేశంలో టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు కతుబుద్దీన్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ముక్తియార్

సైన్స్ ఒలంపియాడ్‌లో గోల్డ్ మెడల్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతేడాది నవంబర్‌లో నిర్వహించిన సాఫ్ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్ విభాగంలో స్థానిక స్వామి వివేకానంద పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న తమ్మిశెట్టి పూర్విక గోల్డ్ మెడల్ సాధించింది. అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి బంగారు మెడల్‌తోపాటు సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ ద్వారా ప్రశంసాపత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా విద్యార్థినితల్లిదండ్రులు తమ్మిశెట్టి అమర్నాథ్, పద్మావతి, పాఠశాల కరస్పాండెంట్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. ఆ మేరకు మంగళవారం పాఠశాలలో టి.పూర్వికను అభినందించారు.


టి.పూర్విక

'బంగారుతల్లి'ని పునరుద్ధరించాలి

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

బాలిక, మహిళా సాధకారత పట్ల కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి, రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే బంగారు తల్లి పథకాన్ని పునరుద్ధరించాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. స్థానికంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2009లో జనవరి 24న జాతీయ బాలికా దినంగా నాటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బంగారుతల్లి పథకాన్ని ప్రకటించిందని తెలిపారు. బాలికల పట్ల సమాజం చూపుతున్న వివక్షను రూపు మాపడమే దీని లక్ష్యమన్నారు. పేద కుటుంబాల్లోని బాలికకు పోష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ, బాలిక విద్యను ప్రోత్సాహించడం, ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులను ప్రోత్సహించడం, ఆడ శిశువుల భ్రూణ హత్యలను నివారించడం అనేది బంగారు తల్లి ప్రయోజనాలుగా ఆయన వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ మంచి పథకాన్ని చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేశారని, దాన్ని జగన్ ప్రభుత్వం పునరుద్ధరించకపోవడం దురదృష్టకరమన్నారు.

పశువ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పశువ్యాధులపై వాటి యజమానులకు అవగాహన ఉండాలని పశువైద్యాధికారి డాక్టర్ జాన్ సుధాకర్ తెలిపారు. మండలంలోని కొట్టాలపల్లి గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పొద్దుటూరు పశువైద్య కళాశాల బృందం, జూనియర్ పశువైద్యులతో కలిసి జాతీయ సేవ పథకం కింద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీవాలకు వైద్య పరీక్షలు చేశారు. రైతులకు పలు సూచనలిచ్చారు. అవసరమైన మందులు, ఖనిజ లవణ మిశ్రమాలను ఆరెస్, దోమేస్త, నాచురల్ రెమెడీస్ కంపెనీల వారు ఉచితంగా పంపిణీ చేసినట్లు డాక్టర్ తెలిపారు. నట్టల నివారణ మందులను రైతులకు అందజేశామన్నారు. జూనియర్ డాక్టర్లు స్పెషలిస్ట్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సన్న జీవాల సంరక్షణ గురించి వివరించారన్నారు. కార్యక్రమంలో పశువైద్య కళాశాల జాతీయ సేవ పథకం అధికారులు డాక్టర్ పి.కళ్యాణి, డాక్టర్ సాయిదిలీప్ గుప్త, క్లినికల్ విభాగం ఆచార్యులు డాక్టర్ ఎం.భార్గవి, డాక్టర్ ఎం.భాస్కర్, గండికోట సర్పంచు ఈశ్వర్, గొర్రెల సంఘం అధ్యక్షుడు హరి నారాయణ, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

భారతావనిలో మహిళకు విశిష్ట స్థానం

ప్రొద్దుటూరు : భారతావనిలో మహిళకు విశిష్టస్థానం ఉందని కౌన్సిలర్ భారతి తెలిపారు. జాతీయ బాలికాదినోత్సవం సందర్భంగా మంగళవారం 2వ వార్డు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అవగాహన సమావేశం నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వరరెడ్డి, సిర్డ్స్ సొసైటీ అధ్యక్షులు సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు గీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక ఆదర్శ పాఠశాలలో యువజన సర్వీసుల శాఖ, స్టెప్ కడప ఆధ్వర్యంలో మీకోసం సేవా సంస్థ వారి సహకారంతో 'వ్యక్తిత్వ వికాసం-కెరీర్ కౌన్సిలింగ్' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ ట్రైనర్ సంధ్య మాట్లాడుతూ విద్యార్థులంతా ఒక లక్ష్యం ఏర్పరుచుకుని, దాన్ని సాధించే దిశగా ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్, మీ కోసం సేవా సంస్థ అధ్యక్షులు పి.విష్ణువర్ధన్, ఏకలవ్య ఫౌండేషన్ నరేష్‌కుమార్, సుశీలమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ సతీష్‌బాబు, స్టెప్ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్లు జి.వి.సుబ్బారావు, టి.నాగయ్య పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాలు ఏర్పాటు చేసుకోవాలి

ముద్దనూరు : రైతులు డ్రిప్, స్ప్రింక్లర్లు పరికరాలు ఏర్పాటు చేసుకునేలా సిబ్బంది కృషి చేయాలని మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్ రఫీ సూచించారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం సూక్ష్మ నీటిపారుదల సేద్య పథకం ఆధ్వర్యంలో ఎఒ వెంకటకృష్ణారెడ్డి అధ్యక్షతన క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 978 మంది రైతులు డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎంఐపి ఎంఐఎ ఏసునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రబీలో ముమ్మరంగా వరిసాగు

ప్రజాశక్తి - చాపాడు

కుందూ, పెన్నా నది, కెసి పరివాహక ప్రాంతంలో రబీ సీజన్‌లో రైతులు వరిసాగులో నిమగ్నమయ్యారు. దుక్కిళ్లు, వరి సాగుకు ఏర్పాట్లల్లో ఉన్నారు. కుందూ నదిలో, కెసి కాలువలో నీరు ప్రవహిస్తుండడంతో వరి సాగు పనులు వేగవంతం చేశారు. కెసి కాలువకు మార్చి చివరి వరకు నీరు విడుదల చేస్తామని అధికారులు ప్రకటించడంతో రైతులు పంటల సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముందస్తుగా సాగు చేసిన పసుపు పంట ఆశాజనకంగా ఉంది. మండల పరిధిలో 350 ఎకరాల్లో పసుపు సాగైంది. 4వేల ఎకరాల్లో వరి పంట సాగు కానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కుందు, పెన్నా పరిధిలో రెండు వేల ఎకరాల వరకు వరి పంట సాగైంది. తిప్పిరెడ్డిపల్లి, అయ్యవారిపల్లె, కుచ్చుపాప, తిమ్మాయిపల్లి, చియ్యపాడు, విశ్వనాథపురం, సిద్ధారెడ్డిపల్లి, సోమాపురం గ్రామాల పరిధిలో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది డీజల్ ధరల పెరు గుదలతో సాగు ఖర్చులు, ఎరువుల ధరలు పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు.


విశ్వనాథపురం పొలాల్లో వేస్తున్న వరినాట్లు

అభివృద్ధి పనులు సిఎంతో ప్రారంభిస్తాం : ఎంపీ


నిత్యాన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - చక్రాయపేట

జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన గండి క్షేత్రంలో అభివృద్ధి పనులను జూలై నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గండి క్షేత్రంలో శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో చేపట్టిన నిత్యాన్నదానం పథకాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ముందుగా ఆలయంలో ఎంపీ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయం తరుపున అవినాష్‌రెడ్డిని శాలువతో సత్కరించి శ్రీవీరాంజనేయ స్వామి చిత్రపటాన్ని అందజేశారు. చక్రాయపేటలో ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండి క్షేత్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో సిఎం రూ.17 కోట్లు నిధులు విడుదల చేశారన్నారు. పనులను సకాలంలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. భక్తులు నిత్యాన్నదాన పథకానికి రూ.1.82 కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. జిల్లాలోని వైసిపి కార్యకర్తల తరపున రెండు రోజుల్లో రూ.18 లక్షలు నిత్యాన్నదానానికి విరాళం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వేంపల్లె, చక్రాయపేట జడ్‌పిటిసిలు రవి కుమార్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, వేంపల్లె, చక్రాయపేట ఎంపిపిలు లక్ష్మి గాయత్రీ, మాధవి, ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, దేవస్థానం ఛైర్మన్ రాఘు వేంద్రప్రసాద్, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ముకుందరెడ్డి, దేవదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ, దేవస్థానం పాలక మండలి సభ్యులు రామాంజనేయులురెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు కేసరిస్వామి, రాజాస్వామి, తహశీల్దార్ రాజానరేంద్ర, వేంపల్లె సర్పంచు రాచినేని శ్రీనువాసులు, నాయకులు, కార్యకర్తలు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత.. అందరి బాధ్యత

ప్రజాశక్తి - చాపాడు

జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని సర్ సివి రామన్ సైన్స్ క్లబ్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో లక్ష్మీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సివి రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసులురెడ్డి రోడ్డు భద్రతపై రూపొందించిన ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచు కర్నాటి శ్రీవిద్య మాట్లాడుతూ అతివేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణాలన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు బి.నర హరి శర్మ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 12 లక్షల మందికిపైగా మరణిస్తున్నారని తెలిపారు. ఇం దులో ఐదు కోట్ల మంది క్షతగాత్రులవుతున్నారని, రోజు 700 మంది పైగా యువకులు రోడ్లపై మరణిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.రాజశేఖర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, చెన్నారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.


చాపాడు : విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

డ్రైవింగ్ నిబంధనలు పాటించాలి

పులివెందుల టౌన్ : డ్రైవర్లు నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని ఎంవిఐ బి.వెంకటప్రసాద్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నారాయణ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. బస్సులో కూర్చున్న విద్యార్థులతో ప్రయాణాలు చేసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపారు. ముఖ్యంగా డ్రైవర్లు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు.

బాల్య వివాహాలు అరికట్టడంలో అంగన్వాడీలే కీలకం


విద్యార్థికి బహుమతి అందజేస్తున్న కలెక్టర్ విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప

బాల్య వివాహాలు అరిక్కట్టడంలో అంగన్వాడీ వ్యవస్థ కీలకమైన పాత్రపోషించాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో "బేటీ బచావో బేటీ పడావో" లో భాగంగా జాతీయ బాలిక దినోత్సవం వేడుకలు జిల్లా మహిళా ,శిశు సంక్షేమ, మహిళా సాధికరిత అధికారి వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ వి. విజయ్ రామరాజు ముఖ్య అధితిగా పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీలు ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. బాల్య వివాహాలు అరికట్టడంలో అంగన్వాడీలు ప్రముఖ పాత్రపోషించాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్టబాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ముదిమెల లక్షిదేవి మాట్లాడుతూ జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ, మహిళా సాధికరిత అధికారి ఎం.ఎన్.రాణి, ఎస్ఎస్ఎ పిఒ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, ఐసిడిఎస్ సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు. **అల్ షిఫాలో..** జాతీయ బాలికల దినోత్సవ సందర్భంగా ఆల్‌షిఫా కేంద్రంలో రాధానగర్, యుపిఎస్‌సిమెడికల్ ఆఫీసర్ జి.స్వర్ణ, 25వ డివిజన్ హెల్త్ సెక్రటరీ కవిత జాతీయ బాలికల దినోత్సవ సందర్భంగా కేక్ కట్ చేసి పిల్లలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు ఎస్ మహమ్మద్ రఫీ, ప్రత్యేక ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు. **గాంధీనగర్ హైస్కూల్‌లో..** ప్రతి ఒక్కరూ చట్టాలపై చిన్నప్పటి నుంచే అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత సూచించారు. మంగళవారం బాలిక దినోత్సవం సందర్భంగా కడప నగరం ఎర్రముక్కపల్లిలో గల గాంధీనగర్ హై స్కూల్‌లో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. **అలీషా స్కూల్‌లో..** కడప నియోజకవర్గంలోని అలీషా స్కూల్ పాఠశాలలో బాలికల దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మైనారిటీస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు మన్సూర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన భారత రాజ్యాంగం పై, ఇంజినీరింగ్ విద్యపై అఫ్జల్ ఖాన్ పాల్గొని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అలీషా స్కూల్ అధ్యక్షులు మజాహర్ అలీ ఖాన్, సెక్రటరీ ఖలీముద్దీన్, ట్రెసరర్,సెక్రటరీ జిలాని, కేఎల్ఎం కాలేజ్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె :మండల పరిధిలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో బాలికల దినోత్సవం సందర్భంగా మహిళా సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కన్వీనర్ సాగరిక, అన్నమాచార్య కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి, మహిళా సంరక్షణ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కలసపాడు :** బాస్ స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో డివిజన్ కో-ఆర్డినేటర్ కిన్నెర శేఖర్‌బాబు అధ్యక్షతన జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎపి దళిత వేదిక జిల్లా కన్వీనర్ ఓబిగాండ్ల ఓబయ్య, యోహాను మండల ఆర్గనైజర్ మాణిక్యమ్మ , కాశినాయన మండల కో- ఆర్డినేటర్ ఓబులేసు, ఆర్గనైజర్ లీలావతి, పోరుమామిళ్ల మండల ఆర్గనైజర్లు విజయకుమార్, అదాము పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** ఆడపిల్ల పుట్టింటికి ప్రాణదీపం.. మెట్టింటికి మణిదీపమని కామనూరు ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ హనీఫ్ తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలన్నారు. తల్లిదండ్రులు ఆడ పిల్లను బాధ్యతగా చదివించి సమాజంలో గౌరవంగా బతికేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ క్రిష్ణమ్మ, హెచ్ఇ శోభారాణి, ఫార్మాసిస్టు శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ మధు, సూపర్‌వైజర్ వర ప్రసాద్, చంద్రకళ, హెల్త్ అసిస్టెంట్ శ్రీను, లక్ష్మినారాయణ పాల్గొన్నారు. స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు, వికసిత ఫౌండేషన్ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ప్రాంగణం నుంచి ర్యాలీగా నినాదాలు చేసుకుంటూ భేటీ బచావో బేటీ పడావో అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డాక్టర్ నాగార్జున జెండా ఊపి ర్యాలీ ప్రారంభిచారు. ప్రస్తుత సమాజంలో బాలికలు వారి అభివృద్ధి వంటి విధానాల మీద ఎలక్ట్రిషన్ కాంపిటీషన్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కో-ఆర్డినేటర్ పర్లపాడు గౌరీశంకర్, వికసిత ఫౌండేషన్ శూలం లక్ష్మీదేవి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విభాగాలు పాల్గొన్నాయి. **చాపాడు :** బాలికలు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో రాణించాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ సూచించారు. స్థానిక కస్తూర్బా పాఠశాల ఆవరణలో మంగళవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో బాలురకు సమానంగా బాలికలకు అవకాశాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. **వేంపల్లె :** ప్రతి ఒక్కరూ ఆడపిల్లలను సంరక్షించాలని హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నిషా కోరారు. మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా వేంపల్లెలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించి, ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభాలో ఎక్కువ మంది ఉన్నత విద్యావంతులు మహిళాలే అయినప్పటికీ వారు హక్కులు గురించి మాట్లాడితే వేధిస్తున్నారని చెప్పారు. బాల బాలికలు ఇద్దరు సమానమే అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హబీబుల్లా, ఫాతిమా కౌషర్, నూర్జహాన్, హేమమాలిని, అరుణ, అబ్దుల్ సలీం, ఎఎన్ఎం నాగశ్వరమ్మ, సిహెచ్ఒ రమాదేవి పాల్గొన్నారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయ్ రామరాజు పేర్కొన్నారు. మంగళవారం ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపం లేకుండా అధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి మెచ్చుకునేలా సకాలంలో పనులు పూర్తిచేసేలా ముందుకు వెళ్లాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుమునుపు స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఉలిమెళ్ళ లేక్ పనులను కలెక్టర పరిశీలించారు. కార్యక్రమంలో పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డిఒ వెంకటేశు, తహశీల్దార్ మాధవకృష్ణారెడ్డి, పురపాలక ఇన్‌ఛార్జి, అన్ని శాఖల అధికారులు ఉన్నారు.


స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

వడ్డీ రహిత బ్యాంకు ఏర్పాటు శుభపరిణామం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

జమాతె ఇస్లామిహింద్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులో ఖిద్మత్ పేరుతో వడ్డీ రహిత బ్యాంకు ఏర్పాటు చేయడం శుభపరిణామమని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. బ్యాంకు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ పేదరికాన్ని, వారి అవసరాన్ని మాత్రమే ప్రమాణంగా తీసుకొని అభివృద్ధిని సాధించేందుకు ఎలాంటి వడ్డీ లేకుండా రుణమివ్వడం హర్షణీయమన్నారు. తనవంతుగా రూ.2లక్షలు డిపాజిట్ చేస్తున్నట్లు సభాముఖంగా ప్రకటించారు. జమాతె ఇస్లామిహింద్ మూలాల్ని గ్రహించి అభివృద్ధికి సహకరించాలన్నారు. తీసుకున్న రుణాన్ని తప్పక చెల్లించాలన్నారు. జమాతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్య క్షుడు రఫీక్, జిల్లా అధ్యక్షులు అహ్మద్ హుసేన్, కౌన్సిలర్లు, ముస్లింలు పాల్గొన్నారు.

లిప్ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

లిప్ శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు తరగతి గదిలో బోధించాలని మండల మానటరింగ్ అబ్జర్వర్ చెరుకూరు శ్రీనివాసులు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులకు అభ్యసనాభివృద్ధిపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రతి ఉపాధ్యాయుడు లిప్ శిక్షణ తరగతును విజయవంతం చేయాలని కోరారు. లిప్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు చదవడం, రాయడం అనేది విద్యార్థులకు నేర్పించాలన్నారు. చదువులో వెనుకబడిన 6,7,8 తరగతుల విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో అకాడమీ మానటరింగ్ అధికారి ఖాజా పర్వీన్, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, దస్తగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శిక్షణనిస్తున్న చెరుకూరు శ్రీనివాసులు

భూ నిర్వాసితులతో ఆర్‌డిఒ సమావేశం

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప-తాడిపత్రి ప్రధాన జాతీయ రహదారిలో నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి సంబంధించి మండలంలోని 8 గ్రామాల్లో 32 ఎకరాల 68 సెంట్లు భూమిని అధికారులు సర్వే చేసి భూ సేకరణ చేశారు. ఆ మేరకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభా భవనంలో మంగళవారం తహశీల్దార్ వెంకటేశ్వర్లుతో కలిసి ఆర్‌డిఒ శ్రీనివాసులు భూ నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ముద్దనూరు, బొందలకుంట, యామవరం, చింతకుంట, కొర్రపాడు, మంగపట్నం, ఓబుళాపురం, కె.రాఘువాపురం రెవెన్యూ గ్రామాలకు సంబంధించి భూమిని సేకరించామన్నారు. జాతీయ రహదారికి సంబంధించి మార్కెట్ రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం రెవెన్యూ గ్రామాల వారీగా కేంద్ర ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. ముద్దనూరుకు రూ.12 లక్షలు, చింతకుంట, మంగపట్నం రూ.7లక్షలు, కొర్రపాడు, ఓబుళాపురం, టి.రాఘువాపురం రూ.6లక్షలు, బొందలకుంట, శెట్టివారిపల్లె, యామవరం గ్రామాలకు సంబంధించి రూ.7లక్షలు ప్రకారం చెల్లిస్తుందన్నారు. భూముల ధర పెంచడం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో లేదన్నారు. అంత తక్కువ ధరకు తమ భూములు ఇవ్వలేమని భూ నిర్వాసితులు అన్నారు. మార్కెట్లో ఎకరా భూమి రూ.50 లక్షలు ఉందన్నారు. గ్రామాల వారీగా కాకుండా ఎకరాకు రూ.15 లక్షలు చొప్పున చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. మీ విన్నపాన్ని కలెక్టర్‌కు నివేదిస్తానని ఆర్‌డిఒ తెలిపారు. మండల సర్వేయర్ విజయ భాస్కర్, ఆర్ఐ ఏసోబు, విఆర్ఒలు, భూ నిర్వాసితులు శివశంకర రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.


భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు

న్యూ కాలనీలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని న్యూ కాలనీలో ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి మంగళ వారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకు తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో అని ఆరా తీశారు. వార్డులోని ప్రజలు చిన్నపాటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అక్కడే ఉన్న సంబంధిత అధికారులకు సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఉపాధ్యాయులను వేధించడం తగదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఉపాధ్యాయులను విద్యాశాఖాధికారులు షోకాజ్ నోటీసులు ఇవ్వడం, సస్పెన్షన్ చేయడం వంటి వేధింపులకు గురిచేయడం తగదని ఎస్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, సుబ్బరాజుయాదవ్ తెలిపారు. స్థానిక ముఖ్యనాయకుల సమావేశంలో వారు మంగళవారం మాట్లాడుతూ పాఠశాలలను సందర్శించడానికి వచ్చే అధికారులు ఉపాధ్యాయుల లోటుపాట్లను సరిచేసి వారికి మార్గదర్శకత్వం చేయకుండా, లోపాల పేరుతో నోటీసులిస్తూ వివరణలు కోరడం సబబుగా లేదన్నారు. వివరాలను సెల్‌ఫోన్‌ల యాప్‌ల ద్వారా నమోదు చేయడం ప్రతి రోజు జరిగే కార్యక్రమం కానీ, తరగతి గదిలో సెల్‌ఫోన్ వాడకూడదని అధికారులు చెప్పడం వింతగా ఉందన్నారు. అదే అధికారులు యాప్‌లలో ఫోటోలు, విద్యార్థుల హాజరు వేయకపోతే మళ్లీ ఫోన్లు చేసి వేయాలని వత్తిడి తెస్తారన్నారు. భవిష్యతులో ఇలాంటి వేధింపులు పునరావృతమైతే ఉపాధ్యాయులనందరినీ సంఘటితం చేసి ఉద్యమం చేయడానికి వెనుకాడబోమని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రామలక్ష్మిరెడ్డి, రామసుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సుగుమంచిపల్లెలో మహిళకు ఒక వాలంటీర్ పోస్ట్ ఖాళీగా ఉందని, దాన్ని భర్తీ చేసేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ అరుంధతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, 27 తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 28న దరఖాస్తులను పరిశీలిస్తామన్నారు. 29, 30తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి, 31న ఎంపిక చేస్తామన్నారు. ఫిబ్రవరి 1 నుంచి విధులకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఖాజీపేట

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని టిడిపి యువ నాయకులు తుల్లె రాము యాదవ్ పిలుపునిచ్చారు. స్థానికంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాదయాత్ర విజయవంతానికి అందరూ సహకరించాలన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలంటే టిడిపి అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందన్నారు. ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. బుధవారం జిల్లా పర్యటనకు రానున్న లోకేష్‌కు బ్రహ్మరథం పట్టాలని ప్రజలను కోరారు.

ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

పులివెందుల టౌన్ : నారాయణ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పులివెందుల మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు వివిధ రాష్ట్రాలకు సంబంధించిన వంటకాలు తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం నరసింహారెడ్డి మాట్లాడుతూ చిన్నప్పటి నుండి సంప్రదాయమైన వంటకాల గురించి తెలుసుకొని, వాటిని అలవాటు చేసుకోవడం ఆరోగ్యానికి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఏజియం చెన్న కేశవరావు, ప్రిన్సిపల్ సునీతారెడ్డి, జిల్లా కో-ఆర్డినేటర్ ఇందిరా, వైస్ ప్రిన్సిపల్ అంజనా దేవి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.